

పెదమరికి సమీపంలో సంచరిస్తున్న గజరాజులు

సేవలకు గుర్తింపు

- జిల్లాలో ఐదుగురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు
- జాబితా విడుదల చేసిన ప్రభుత్వం

పార్వతీపురం, నవంబరు9 (ఆంధ్రజ్యోతి)/ కొమరాడ/ పాలకొండ/ సాలూరు రూరల్/ పాచిపెంట/ మక్కువ/గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డులకు పలువురిని విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం జాబితా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఐదుగురు జిల్లావాసులు ఉండడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 11న జాతీయ విద్యా దినోత్సవం సంద ర్భంగా వారికి అవార్డులు ప్రదానం చేయనున్నారు. కొమరాడ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు, మక్కువ మండలం ఎ.వెంకంపేట జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఉపాధ్యా యుడు గొంగాడ రామారావు, పాలకొండ ఎంపీయూపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ జంప జయమణి, పాచిపెంట మండలం నూరువరహాలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యుడు పొట్నూరు ఈశ్వరరావు , గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీరంజని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

బాధ్యత పెరిగింది..



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగింది. 40 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నా. విజయనగరం జిల్లాలో రేగిడి మండలం, పాలకొండ, ఎల్.ఎల్.పురం, వెలగవాడ, ఏలాంలో పనిచేశారు. ప్రస్తుతం హడ్కోకాలనీలో విధులు నిర్వర్తిస్తున్నా. నిరంతరం విద్యార్థుల విద్యా ప్రగతికి కృషి చేస్తుంటా. తోటి ఉపాధ్యాయుల సహాయ సహకారాలతోనే అది సాధ్యమైంది.

-జె.జయమణి, సోషల్ అసిస్టెంట్, హడ్కోకాలనీ, పాలకొండ

మరింత మెరుగ్గా పనిచేస్తా..



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఇప్పుడు మరింత బాధ్యత గా పనిచేస్తా. బోధనాభ్యాసన కార్యక్రమాలను మెరుగ్గా నిర్వహిస్తా. 1998లో గజపతినగరం మండలం సాలిపేటలో తొలిసారిగా ఉద్యోగంలో చేరా. మరుపల్లి, డోల పాలెం, నెల్లిమర్ల మండలం టెక్కలిలో విధులను నిర్వహించా. 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్‌ను అందుకున్నా. టెక్కలి నుంచి పాచిపెంట మండలం నూరువరహాలుపాడుకు బదిలీపై వచ్చా.

-పొట్నూరు ఈశ్వరరావు, ఉపాధ్యాయుడు, నూరువరహాలపాడు పాఠశాల , పాచిపెంట మండలం

ఆనందంగా ఉంది..



రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. 32 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా. ఎన్నో అవార్డులను అందుకున్నా. అయితే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంతో మరింత బాధ్యత పెరిగింది.

-డి.లక్ష్మణరావు, ప్రిన్సిపాల్, గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల, కొమరాడ

గర్వంగా ఉంది..



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికైనందుకు గర్వంగా ఉంది. గతంలో ఎన్ని అవార్డులు తీసుకున్నా రాష్ట్రస్థాయి అవార్డు సాధించడం మరచిపోలేని అనుభూతి. నేను విధులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో సన్మానాలు, బొబ్బిలివీణ, సరస్వతి జ్ఞాపికలు తీసుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా.

-గొంగాడ రామారావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు, ఏ.వెంకంపేట, జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్, మక్కువ మండలం

తోటి సిబ్బంది సహకారంతో..



తోటి ఉపాధ్యాయుల సహకారంతో విద్యా ప్రమాణాల మెరుగుకు ఎంతగానో కృషి చేశాం. ఏదేమైనా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు రావడం ఆనందంగా ఉంది.

-శ్రీరంజిని, ప్రిన్సిపాల్, కేజీబీవీ, గుమ్మలక్ష్మీపురం

హడలెత్తిస్తున్నాయ్..

- పార్వతీపురం మండలంలో ఏనుగుల హల్‌చల్

పార్వతీపురం రూరల్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. నిన్నటి వరకు సంగంవలస తోటలో సంచరించిన గజరాజులు శనివారం ఉదయం పిట్టలవలసకు చేరుకున్నాయి. ఆ గ్రామంలో చెరువులో సేదతీరాయి. అనంతరం పెదమరికి చేరుకున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అవి సంచరిస్తుండడంతో గ్రామస్థులు, రైతులు హడలెత్తిపోతున్నారు. అటవీశాఖాధికారులు వాటిని పర్యవేక్షిస్తున్నప్పటికీ ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందు తున్నారు. కాగా ఏనుగులు ఏ సమయంలోనైనా పార్వతీపురం నుంచి కొమరాడ మండలంలోకి చేరుకునే అవకాశం ఉండడంతో ఆ ప్రాంతవాసులు కూడా బెంబేలెత్తిపోతున్నారు. ఎవరికీ ఎటువంటి నష్టం జరగకుండా అటవీశాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పిల్లల బియ్యం.. పక్కదారి

- ఆశ్రమ పాఠశాలలకు చేరని వైనం
- చర్చనీయాంశంగా మారిన కొమరాడ ఘటన



పార్వతీపురం, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు చేరాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నాయి. విద్యార్థులకు అందాల్సినవి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. పిల్లలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఎంతగా చెబుతున్నా.. కొందరు పట్టించుకోవడం లేదు. విద్యార్థులను అర్ధాకలితో ఉంచుతూ.. యథేచ్ఛగా బియ్యాన్ని తరలిస్తున్నారు. కాగా ఈ నెల 8న కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బియ్యాన్ని విక్రంపురంలోని ఓ ఇంటిలో అధికారులు స్వాధీనం చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఆ పాఠశాలకు 89 బస్తాల్లో బియ్యం తీసుకెళ్తున్న వాహనం విక్రంపురం గ్రామంలో 35 బస్తాలను దించినట్లు గుర్తించి సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన 17.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్థానిక డీలర్‌కు అప్పగించారు. అయితే ఈ ఘటనతో ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థుల పరిస్థితిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వారికి మూడు పూటలా పూర్తిస్థాయిలో ఆహారం అందుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకు రేషన్ బియ్యం పక్కదారి పట్టడం చూశాం.. అయితే జిల్లాలో తొలిసారిగా ఇలా ఆశ్రమ పాఠశాలలకు చెందినవి ఓ ఇంటిలో లభ్యం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ఇప్పటికే చాలా మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి సక్రమంగా పౌష్టికాహారం అందించాల్సి ఉంది. అయితే కొంతమంది పిల్లలకు అందించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ క్షమించరాని తప్పు చేస్తున్నారనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అసలు విక్రంపురంలో పట్టుకున్న బియ్యం ఎలా అక్కడ దించారు? దీనివెనుక ఎవరు ఉన్నారన్న? దానిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సి ఉంది. ఒకవేళ ఆశ్రమ పాఠశాల సంరక్షకులు లేక ఇంకెవరైనా కీలకంగా వ్యవహరించినట్లు తేలితే.. కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఇలా అయితే పౌష్టకాహారం ఎలా..?

వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలకు తక్కువ ధరకే కూరగాయలు సరఫరా చేస్తామన్న వారికే అధికారులు సైతం టెండర్లు ఖరారు చేస్తున్నారు. అయితే ఒక్క రూపాయికే కిలో, బీట్‌రూట్ ఎలా పంపిణీ చేయగలరన్నది పరిశీలించడం లేదు. దీంతో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లోనూ హాస్టళ్ల, ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. గిరిజన విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందడం లేదు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. చాలాచోట్ల ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్లు రాత్రి వేళల్లో ఉండడం లేదు. ఈ క్రమంలో పిల్లలకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో ఎలా అందుతుందో ఉన్నతాధికారులే చెప్పాలి.

విద్యా ప్రమాణాల

మెరుగుకు చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : వసతిగృహాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. పల్లెనిద్ర, గ్రామ దర్శిని కార్యక్రమాలపై శనివారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పల్లెనిద్ర ప్రత్యేక అధికారులు నివేదికలను అనుసరించి విద్యా ప్రమాణాలపై దృష్టిసారించాలని సూచించారు. నిర్దేశిత సమయంలో వైద్యసేవల వివరాలు పొందుపర్చాలని, ఆరోగ్య అంశాల్లో జాప్యం తగదని తెలిపారు. వసతిగృహాల్లో ఉపాధ్యాయుడు ఒక తరగతిని దత్తత తీసుకోవాలని చెప్పారు. దీని వల్ల పర్యవేక్షణ లోపాలు నివారించొ చ్చన్నారు. సీతంపేట ఐటీడీఏలో నిర్వహిస్తున్న సూపర్ 60 బ్యాచ్‌లో పార్వతీపురం విద్యార్థులను చేర్చాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, సీతంపేట సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రాతో గట్టెక్కిన ఆంధ్ర

- ముగిసిన రంజీ ట్రోఫీ

6లో

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ చూపాలి

- లేకుంటే కఠిన చర్యలు
- ఏం జరిగినా సిబ్బందిదే బాధ్యత
- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాస్తవ

జియ్యమ్మవలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఆర్‌ఆర్‌బీ పురం టీడబ్ల్యూహెచ్ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి జీవన్‌కుమార్ ఆకస్మిక మృతిపై విచారణ చేపట్టారు. ఇటీవల జరిగిన ఈ ఘటనపై ఆరా తీశారు. ముందుగా సహ విద్యార్థులు .. ఆ తర్వాత వార్డెన్, డిప్యూటీ వార్డెన్, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, వారికి ఆరోగ్యం బాగోలేకపోతే వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. ఎవరికి ఏమి జరిగినా హెచ్ఎం, వార్డెన్, డిప్యూటీ వార్డెన్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం పాఠశాలలో డార్మిటరీ, టాయిలెట్లు, కిచెన్ రూము, స్టోర్ రూము పరిసరాలను పరిశీలించారు. ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు, హెచ్ఎం ఎన్.తిరుపతి, డిప్యూటీ వార్డెన్ ఎల్.గణపతిరావు తదితరులు ఉన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

క్షయ నిర్మూలనే లక్ష్యంగా..

- ప్రభుత్వ ఆదేశాలతో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే
- గ్రామాల వారీగా వ్యాధిగ్రస్థుల గుర్తింపు
- 49 కేంద్రాల్లో నిర్ధారణ పరీక్షలు
- మందులు ఉచితం - పౌష్టికాహారం సాయం పెంపు



కొమరాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు వైద్య ఆరోగ్యశాఖ నడుం బిగించింది. ఈ మేరకు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంపీఎల్‌హెచ్, తదితర సిబ్బందితో సర్వే చేపడుతోంది. గ్రామాల వారీగా రోగు లను గుర్తిస్తోంది. 2027 నాటికి క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వ్యాధిగ్రస్థులను గుర్తించడంతో పాటు వారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. వ్యాధి నిర్ధారణకు ప్రత్యేక పరీక్షలు చేస్తున్నారు. మొత్తంగా క్షయ నిర్మూలనే లక్ష్యంగా వైద్య శాఖ సిబ్బంది పనిచేస్తున్నారు.

సర్వే ఇలా..

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు చేపట్టిన సర్వేలో 20,201 మంది క్షయ వ్యాధి అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 1,092 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. వీరందరికీ ఉచితంగా మందులు అందించి వైద్య సేవలు అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో మందులు వాడి కోర్సు పూర్తి చేస్తే ఆ రోగులంతా టీబీ నుంచి బయటపడనున్నారు. గతేడాది 22,536 మందికి పరీక్షలు నిర్వహించగా 923 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ ఆరు నెలల కోర్సును అందిం చడంతో పూర్తిగా ఆరోగ్యవంతులుగా మారినట్లు వైద్యాధి కారులు చెబుతున్నారు. వీరి ఆరోగ్యంపైన ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నట్లు జిల్లా టీబీ నియంత్రణ అధికారి తెలిపారు.

49 కేంద్రాల్లో..

ప్రత్యేక పరికరాల ద్వారా చేసే పరీక్షల ద్వారా ప్రాథమికంగానే వ్యాధిని గుర్తించే వీలుంది. రోగి వాడే మందులు పనిచేస్తున్నాయా? లేదా? అని తెలుస్తుంది. అప్పుడే రోగికి సరైన వైద్యం అందించే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎంపిక చేసిన 49 కేంద్రాల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలన్నీ ఉచితంగా చేపడుతున్నారు. వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు రూ. 500లు అందించేవారు. ఈ మొత్తం వెయ్యి రుపాయలకు పెంచారు. ఈ మొత్తం రోగి ఖాతాలో జమ కానుంది.

ఇవీ లక్షణాలు

రెండు వారాల పాటు జ్వరం, దగ్గు ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. శరీర బరువు తగ్గుతుంది. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదిస్తే ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. రోగ నిర్ధారణ అయిన వెంటనే కోర్సు ప్రారంభించి ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు వైద్యం అందిస్తారు. మందులు ఉచితంగా ఇస్తారు. మందులు చెప్పిన సమయానికి సక్రమంగా వేసుకుంటున్నారో లేదో అని గ్రామస్థాయిలో ఆశా కార్యకర్త, ఏఎన్ఎం, సీహెచ్‌డబ్ల్యూలు పరిశీలిస్తుంటారు.

ప్రాణాంతకం కాదు

క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదు. అయితే వ్యాధిగ్రస్థుల దగ్గు, తుమ్ము ద్వారా ఇతరులకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. అందుకే మాస్కులు ధరించి ఉండడం శ్రేయస్కరం.

- ఎం.వినోద్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి క్షయ నివారణ అధికారి



సర్వే నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది (ఫైల్)

నామినేటెడ్ సందడి

- రెండో జాబితా విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జనసేన నేతలకు పదవులు

పాలకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండో జాబితాను శనివారం విడుదల చేసింది. పెద్ద సంఖ్యలో పదవులను భర్తీచేయగా.. ఈ లిస్టులో జిల్లావాసులు కూడా ఉన్నారు. పాలకొండ నియోజకవర్గం నుంచి ఇద్దరు జనసేన నాయకులకు సముచిత స్థానం కల్పించారు. తూర్పుకాపు సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా పాలకొండకు చెందిన జనసేన సీనియర్ నాయకులు పాలవలస యశస్విని నియమించారు. వీరఘట్టం మండలం పనసనందివాడకు చెందిన యువ పారిశ్రామికవేత్త కొరికాన రవికుమార్‌కు శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఛైర్మన్‌గా నియమించారు.



జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీ పెట్టిన దగ్గర నుంచి పాలవలస యశస్విని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం కేంద్రంగా ఉంటూ క్రియాశీలకంగా వ్యవహరించారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె జనసేనలో పీఏసీ మెంబర్‌గా, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా, రాష్ట్ర పార్టీ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. 2024లో పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా వ్యవహరించారు. విజయనగరం సీటు ఆశించారు. అయితే అదే జిల్లా నుంచి నెల్లిమర్ల సీటును లోకం మాధవికి కేటాయించడంతో కూటమి సర్దుబాటుల్లో సీటు దక్కలేదు. ప్రస్తుతం పార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్న ఆమెకు తూర్పుకాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవి దక్కడంపై శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలం పనసనందివాడకు చెందిన యువ పారిశ్రామికవేత్త కొరికాన రవికుమార్ పాండిచ్చేరిలో గోల్డెన్‌స్టార్ మెరైన్ హేచరీస్ అధినేతగా ఉన్నారు. కొన్నాళ్లుగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో జనసేన నాయకుడిగా ఉన్నారు. ఆయన భార్య భవానీ 2024 ఎన్నికల్లో జనసేన టిక్కెట్ కోసం ఆశించారు. అయితే కూటమి సర్దుబాట్లుతో సీటు దక్కలేదు. పాతపట్నం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా బరిలో దిగిన మామిడి గోవిందరావు, పాలకొండలో జనసేన తరఫున పోటీ చేసిన నిమ్మక జయకృష్ణ గెలుపు కోసం వారు కృషి చేశారు. కాగా రవికుమార్‌ను శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమించడంపై కూటమి నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిరుత్సాహంలో టీడీపీ, బీజేపీ శ్రేణులు

పార్వతీపురం, నవంబరు9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ , బీజేపీ ద్వితీయ శ్రేణి నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కలేదు. దీంతో ఎంతోమంది నిరుత్సాహం చెందారు. జిల్లాలో ప్రధానంగా కొప్పుల వెలమ సామాజిక వర్గానికి ఛైర్మన్ పదవి దక్కుతుందని ఆశించినా ఫలితం లేకుండాపోయింది. రాష్ట్రస్థాయి పదవుల్లో ఏ ఒక్కటీ వరించక పోవడంతో ద్వితీయ శ్రేణి నేతలు విచారం వ్యక్తం చేశారు. అయితే భవిష్యత్తులో జిల్లాకు న్యాయం జరుగుతుందని వారు ఆశిస్తున్నారు.

టీకా.. ప్రాణాలకు రక్ష

- పుట్టిన బిడ్డ నుంచి పదహారేళ్ల వరకు తప్పనిసరి
- ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడతాయి
- ఉచితంగా వేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ
- నేడు ప్రపంచ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం

6లో

ఒక్క క్షణం ఆలోచించండి

- క్షణికావేశంతో ఆత్మహత్యలు చేసుకోవద్దు
- కుటుంబాలను అగాథంలోకి నెట్టొద్దు
- చిన్న కారణాలకే ఉసురు తీసుకుంటున్న యువత
- కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్న వైనం

6లో



టీకా.. ప్రాణాలకు రక్ష

టీకాలు..
ప్రజల ప్రాణాలకు రక్షణ కవచాలు. ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి మనల్ని కాపాడతాయి. అంటువ్యాధులు వ్యాప్తిని దూరం చేస్తాయి. శిశువు పుట్టినప్పటి నుంచి వారికి 16ఏళ్లు వచ్చేవరకు వ్యాక్సినేషన్ తప్పనిసరి. అశ్రద్ధ వహిస్తే వారి ప్రాణాలకే ముప్పు. అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, విలేజ్, వార్డు హెల్త్ క్లినిక్‌లు, ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద టీకాలు వేస్తారు. వ్యాధుల నివారణకు టీకాలు వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆదివారం ప్రపంచ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- పుట్టిన బిడ్డ నుంచి పదహారేళ్ల వరకు తప్పనిసరి
- ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడతాయి
- ఉచితంగా వేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ
- నేడు ప్రపంచ వ్యాధి నివారణ టీకాల దినోత్సవం

శృంగవరపుకోట నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొవిడ్-19 ఈపేరు చెబితేనే వెన్నులో వణుకు పుడుతుంది. ఈ చిన్న వైరస్ మూడేళ్ల పాటు ప్రపంచాన్ని గజగజలాడించింది. కోట్లలో జనాభా అంతమైంది. 2019 డిసెంబరులో భారతదేశంలోనూ ప్రవేశించిన ఈ వైరస్ మొదటి, రెండో దశలో ఎంతో మంది ప్రాణాలను హరించింది. ఇంతటి వైరస్‌ను ఎదుర్కొనేందుకు రెండేళ్ల తరువాత మన దేశం వ్యాక్సిన్‌ను కనిపెట్టింది. కొవిడ్‌నుంచి ప్రజలను కాపాడింది ఈ టీకా. క్షయకు బీసీజీ, పోలియోకు-ఓపీవీ, నీలవిరేచనాలకు-ఆర్‌వీవీ, న్యూమేనియాకు-పీసీవీ, తట్టువ్యాధికి-ఎంఆర్, ధనుర్వాతం, కోరింత దగ్గు, కంఠసర్పి, పచ్చకామెర్లు, న్యూమేనియా వంటి ఐదు రకాల వ్యాధులకు కలిపి పెంటావాలెంట్ టీకాలను వైద్య ఆరోగ్య శాఖ అందిస్తుంది. పుట్టిన బిడ్డ నుంచి పదహారేళ్ల వరకు ఈ టీకాలు వేస్తారు. ఇవన్నీ ప్రజలు ఆరోగ్యంగా బతికేలా చేస్తున్నాయి.

వ్యాధుల నుంచి రక్షణ..

ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో నిత్యం ఎంతో మంది పిల్లలు పుడుతున్నారు. వీరు రోగాల బారిన పడకుండా వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి. బిడ్డ పుట్టినప్పటి నుంచి వారికి 16ఏళ్లు వచ్చేవరకు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తుంది. బీసీసీ నుంచి పెంటావాలెంట్ వరకు అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉంటున్నాయి. వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలంటే తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యం కోసం శ్రద్ధ పెట్టాలి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వ్యాక్సినేషన్ (టీకా కార్యక్రమం) నిర్వహిస్తున్నారు. ప్రతి బుధవారం, శనివారం గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లీనిక్ (వెల్‌నేస్ సెంటర్), ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద ఏఎన్ఎంలు (ఆరోగ్య కార్యకర్తలు) టీకాలు వేస్తున్నారు. పిల్లలు జన్మించిన వెంటనే బీసీజీ (బాసిల్లె క్లామెట్టి గ్యూరిన్), ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) హైపటైటిస్-బి టీకాలు వేస్తున్నారు. ఆరు, పది, పద్నాలుగు వారాలకు పెంటావాలెంట్ (పెంటా-1,పెంటా-2, పెంటా-3) ఆర్‌వీవీ (రోటా వైరస్ వ్యాక్సిన్ 1,2,3)పీసీవీ (నిమోకోకల్‌కంజుగేట్ వ్యాక్సిన్ 1,2) తొమ్మిది నెలలకు ఎంఆర్ (మీజిల్స్ తట్టు-1), జేఈ (జపనీస్ ఎన్‌సీఫాలిటిక్స్ వ్యాక్సిన్ -1) విటమిన్ ఏ, పీసీవీ బూస్టర్, 16 నుంచి 24నెలల మధ్య డీపీటీ (డిఫ్తీరియా ,పెర్టుసిస్, టెటనస్)బూస్టర్, ఓపీవీ బూస్టర్, ఎంఆర్-2, జీఈ-1, విటమిన్ ఏ, 5నుంచి 6 ఏళ్ల పిల్లలకు డీపీటీ బూస్టర్-2, 10 నుంచి 16 ఏళ్ల పిల్లలకు టీడీ (టెటనస్ డిఫ్తీరియా)టీకా చిన్నారులకు కచ్చితంగా వేయించాలి. అన్ని రకాల టీకాలను సకాలంలో వేయించడం వల్ల 12 ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.

వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది..



వ్యాధుల నుంచి టీకాలు రక్షణ కల్పిస్తాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. పుట్టిన వెంటనే బిడ్డకు వైద్యుల సలహాతో టీకాలను వేయించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేకంగా శ్రద్ధపెట్టాలి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో టీకాలు వేసేందుకు ఆరోగ్య కార్యకర్తలు క్షేత్ర స్థాయికి వస్తున్నారు. విలేజ్, వార్డు హెల్త్ క్లినిక్‌లు, ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద వైద్యులు సూచించిన విధంగా క్రమ పద్ధతిలో ఈ టీకాలను వేస్తున్నారు. ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలు ఎంతో మంది చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్నాయి. వారు ఎదుగుదలకు దోహదపడుతున్నాయి.

-డాక్టర్ ఎస్‌వీ సత్యశేఖర్
(ఎంఎస్ జనరల్ లెప్రోస్కోపిక్ సర్జన్), శృంగవరపుకోట



జామిలో చిన్నారులకు టీకాలు అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

పట్టు తప్పితే అంతే..

- ప్రమాదపు అంచున రైలు ప్రయాణం

విజయనగరం రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణాల్లో కొందరు వ్యక్తులు డోర్లకు వేళాడుతూ.. మెట్ల వద్ద కూర్చొంటున్నారు. దీనివల్ల కొన్నిసార్లు అదుపుతప్పి కిందకు పడి మృత్యువాత పడుతున్నారు. నిత్యం ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. అయినా ప్రయాణికుల్లో మార్పురావడం లేదు. శనివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి భువనేశ్వర్ వెళ్తున్న రైలులో ప్రతి బోగి వద్ద కొందరు ప్రయాణికులు డోర్లకి వేలాడుతూ, మెట్ల వద్ద కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణించడం కనిపించింది. విజయనగరం కంటోన్మెంట్ రైల్వే వంతెన వద్ద ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.



రైలు డోర్లు, మెట్ల వద్ద ప్రమాదకరంగా ప్రయాణికులు

ఓల్డ్ ఈజ్ గోల్డ్ అనేలా..

- ఆడి.. పాడి.. అలరించిన అపూర్వ స్నేహితులు



పౌరాణిక వేషధారణలలో ఓల్డ్ ఫ్రెండ్స్

రాజాం రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరు పదులకు చేరువవుతున్నా.. వారిలో ఉత్సాహం ఇసుమంతైనా తగ్గలేదు.. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలుగా మారినవారు సైతం చిన్ననాటి స్నేహితుల్ని చూసి ఉప్పొంగి గెంతులేశారు. కొంత మంది తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఆత్మీయ కలయికలో సందడి చేశారు. చిన్ననాటి మిత్రులు చేస్తున్న అల్లరిని కనులారా చూసి ఆనందించారు.. రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి హాజరైన ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు 80 మంది శనివారం రాజాం రిసార్ట్‌లో సందడి చేశారు. ఆడి, పాడి, అలరించారు. కష్టసుఖాలను తెలుసుకున్నారు. కుటుంబాల వివరాలు, పిల్లల అభ్యున్నతి, వారి వివాహాలు, ఉద్యోగాలు తదితర అంశాలపై చాలాసేపు చర్చించుకున్నారు. చిన్ననాటి నుంచి కళలపై మక్కువ ఉన్న వారంతా శ్రీకృష్ణుడు, అర్జునుడు, నకుల సహదేవులు, నారదుడు, శివుడు, యముడు తదితర పౌరాణిక వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తామేం తీసిపోమన్నట్లు మహిళలు సైతం శ్రీకృష్ణుడి సరసన రుక్మిణి, సత్యభామ, చెలికత్తెల వేషధారణలతో వేదికపై సందడి చేశారు. తాము ప్రాథమిక విద్యనభ్యసించిన భవన సముదాయంలో ప్రస్తుతం జూనియర్, డిగ్రీ కళాశాలల తరగతులు జరుగుతున్నాయి. ఆ ప్రాంగణంలో గతంలో నిర్మించిన కళాభారతి వేదిక ఉండిపోవడంతో ప్రస్తుతం ఉన్నత పాఠశాల నిర్వహిస్తున్న భవన సముదాయ ప్రాంగణంలో వేదిక నిర్మించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. సేవా కార్యక్రమాలపై ఆదివారం మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని నిర్వాహకులు డా.రఘు, సాయి ప్రశాంత్‌కుమార్ స్పష్టం చేశారు.



ఒక్క క్షణం ఆలోచించండి

- క్షణికావేశంతో ఆత్మహత్యలు చేసుకోవద్దు
- కుటుంబాలను అగాథంలోకి నెట్టొద్దు
- చిన్న కారణాలకే ఉసురు తీసుకుంటున్న యువత
- కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్న వైనం

రాజాం రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)



చిన్నపాటి కారణాలతో కొందరు యువత ఆత్మహత్య చేసుకుని కన్నవారికి కడుపుకోతని, అయినవాళ్లకు శోకాన్ని మిగులుస్తున్నారు. ఒక్కొక్కరిది ఒక్కో సమస్య. వీటిన్నింటికీ మరణమే పరిష్కారమా? అంటే కాదంటున్నారు మానసిక వైద్య నిపుణులు. యువతీ యువకుల మధ్య ప్రేమ ఫలించకపోయినా, తల్లిదండ్రులు మందలించినా, అప్పులుపాలైనా, అనుకోని అవమానం ఎదురైనా, అనుకున్నది సాధించలేకపోయినా కొందరు ఆత్మహత్యే శరణ్యమని భావిస్తున్నారు. కొంతమందికి జీన్స్‌లోని దుడుకుతనం, పెరిగిన వాతావరణం, కుటుంబ నేపథ్యం ఆత్మహత్యకు ప్రేరణగా మారుతున్నాయి. అయితే, క్షణికావేశంలో వారు తీసుకుంటున్న నిర్ణయాలు వారి కుటుంబాలను అగాథంలోకి నెట్టేస్తున్నాయి. ఏదైనా సమస్య వస్తే పరిష్కార మార్గాన్ని అన్వేషించాలే తప్ప ఆత్మహత్యకు పాల్పడకూడదని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. 'మనం ఆత్మహత్య చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ పరిస్థితేంటి' అని ఒక్కక్షణం ఆలోచించాలని అంటున్నారు ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు ఎం.గంగాధర్.

- గతనెల 18న రేగిడి మండలం అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన గోగుల యోగేశ్వరరావు (21) తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చదువులో రాణించలేక పోతునున్నానని మనస్తాపంతో ప్రాణాలు తీసుకున్నాడు.
- గతనెల 15న రాజాం పట్టణంలోని గాయత్రి కాలనీకి చెందిన బెల్లాన జగదీష్ (20) అనే యువకుడు గడ్డి మందు తాగాడు. నాలుగు రోజుల పాటు ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడి 19న మృతి చెందాడు. తాను పనిచేస్తున్న షాపు యజమానికి కొందరి ద్వారా జగదీష్ కొంతమొత్తం అప్పు ఇప్పించాడు. ఆ యజమాని పరారవడంతో అప్పు ఇచ్చిన వారు తనపై ఒత్తిడి తెస్తారేమో నన్న భయంతో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- గతనెల 21న తెర్లాం మండలం ఉద్దవోలుకు చెందిన మామిడి శివ (25) అనే యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శివ.. రాజాంలో టిఫిన్ షాపు పెట్టాడు. దీనికోసం కొంత అప్పు చేశాడు. అయితే వ్యాపారం సరిగా లేదని, అప్పుల భయంతో పురుగు మందు ఉసురు తీసుకున్నాడు.

ఆత్మహత్యకు ప్రేరిపించే అంశాలు..

- బతుకుమీద ఆశలేకపోవడం, ఆ భావాల్ని తమ మాటల్లో వ్యక్తపరచడం.
- తాము చనిపోతే మంచి జరుగుతుందని, పరిస్థితి మారుతుందన్న ఆలోచనలు రావడం.
- స్నేహితులతో కలవకుండా ఒంటరిగా తిరుగుతుండడం.
- ఇష్టపడే వస్తువుల్ని స్నేహితులు, సన్నిహితులకు ఇవ్వడం. అందరికీ ఫోన్లు చేయడం. డైరీ అలవాటు లేకపోయినా అకస్మాత్తుగా ఏదో రాయాలని ప్రారంభించడం.
- చిన్నచిన్న విషయాలకే అసహనాన్ని ప్రదర్శించడం. ఎక్కువగా ఆలోచిస్తూ గడపడం. చిన్న చిన్న తప్పులకు కూడా ఎక్కువగా స్పందించడం. చదువులో, చేసే ఉద్యోగంలో వెనుకబడ్డాడని బాధపడడం. ఇలాంటి లక్షణాలు ఉన్న వారు ఆత్మహత్యకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డాక్టర్ గంగాధర్ చెబుతున్నారు.



డా.గంగాధర్

తల్లిదండ్రులు ఈ జాగ్రత్తలు పాటించాలి..

- పిల్లల్ని ఎక్కువగా ముద్దుచేసే తల్లిదండ్రులు వారిపట్ల ఎలాంటి పరిస్థితుల్లో పరుషంగా మాట్లాడకూడదు. పరీక్ష తప్పినా, చిన్నపాటి తప్పిదం జరిగినా అతిగా మందలిచంకూడదు.
- ఇతరు పిల్లలతో మన పిల్లల్నిపోల్చకూడదు. ఇతరుల గొప్పతనాన్ని మన పిల్లల వద్ద మాట్లాడకూడదు..
- ప్రేమ, పెళ్లి విషయాల్లో సున్నితంగా వ్యవహరించాలి. వారికి అర్థమయ్యే రీతిలో చెప్పగలగాలి. తప్పదు అంటే వారి మాటకే విలువనివ్వాలి.
- పిల్లల్ని విమర్శించి వారిపట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ఆత్మహత్యకు పాల్పడే అవకాశాలున్నాయని చాలా సంఘటనలు రుజువు చేశాయి.
- పిల్లల నుంచి మనం ఏం కోరుకుంటున్నామో వారికి అర్థమయ్యేరీతిలో చెప్పాలి.
- భార్యాభర్తల వ్యవహారాలకు సంబంధించి ఒకరు అతిగా వ్యవహరిస్తే మరొకరు కాస్త తగ్గాలి.
- ఆర్థికపరమైన సమస్యలు తలెత్తినపుడు అతిగా ఆలోచించకుండా సంయమనం పాటించాలి.



డ్రాతో గట్టెక్కిన ఆంధ్ర

- అర్థ సెంచరీలతో రాణించిన భరత్, విహారి, కరణ్‌షిండే

విజయనగరం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ డి మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు డ్రాతో గట్టెక్కింది. మూడు రోజులుగా బౌలర్లకు సహకరించిన పిచ్, ఆఖరిరోజు బ్యాటింగ్‌కు సహకరించడంతో పాటు ఆంధ్రా బ్యాటర్లు పోరాటంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. విజయనగరం సమీప చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆతిథ్యంలో ఆంధ్రా-ఉత్తరాఖండ్ రంజీ క్రికెట్ మ్యాచ్ నాలుగు రోజులుగా జరుగుతోంది. చివరి రోజు ఆటలో ఓవర్‌నైట్ స్కోర్ 8/1తో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు 6.3 ఓవర్లలో ఓపెనర్ హేమంత్‌రెడ్డి (2) స్వల్ప స్కోర్‌కే అవుట్‌కాగా, కెప్టెన్ రషీద్ (31) కరణ్‌షిండేతో కలిపి మూడో వికెట్‌కు 43 పరుగులు జోడించి ధపోలా బౌలింగ్‌లో ఎల్‌బిడబ్ల్యుగా అవుటయ్యాడు. ఆంధ్రా కష్టాల్లో ఉన్న సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన సీనియర్ బ్యాటర్ హనుమవిహారి, కరణ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. లంచ్ సమయానికి మరో వికెట్ పడకుండా ఇన్నింగ్స్‌ను గాడినపెట్టారు. లంచ్ ముగిసిన అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ఇద్దరు నాలుగో వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పగా కరణ్‌షిండే (65 పరుగులు) అర్థ సెంచరీ సాధించాడు. అయితే ఈ భాగస్వామ్యాన్ని ధపోలా విడదీశాడు. కరణ్‌షిండేను అవుట్ చేశాడు. అప్పటికీ కష్టాలు తొలగని ఆంధ్రా జట్టును బ్యాటింగ్‌కు వచ్చిన సీనియర్ బ్యాటర్ కె.ఎస్.భరత్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో ఊపు తీసుకువచ్చాడు. వన్డే తరహాలో బ్యాటింగ్ చేసిన భరత్ ఒకానొక దశలో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. క్రీజులో పాతుకుపోయాడు. భరత్‌తో 136 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పిన హనుమవిహారీ (66 పరుగులు) జట్టు సురక్షిత స్థితికి చేరుకున్న సమయంలో వేగంగా ఆడే ప్రయత్నంలో 276 పరుగుల వద్ద ధపోలా బౌలింగ్‌లో హనుమవిహారీ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. చేతిలో మరో 5 వికెట్లు, తక్కువ ఓవర్లే ఉండటంతో భరత్ (90 బంతుల్లో 92 పరుగులు) దూకుడు తగ్గించకుండా జట్టును గెలిపించే ప్రయత్నంలో 91 ఓవర్లలో 282 పరుగుల వద్ద ఆదిత్య తారే బౌలింగ్‌లో క్యాచ్ అవుట్‌గా వెనుతిరిగాడు. మరో రెండు ఓవర్లపాటు ఆట కొనసాగించిన అంపైర్లు వెలుతురు లేమి కారణంగా 286/6 స్కోర్ వద్ద ఆటను నిలిపేయడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆంధ్రా కోల్పోయిన 6 వికెట్లలో ఉత్తరాఖండ్ బౌలర్ ధపోలా 5 వికెట్లు తీయడం విశేషం.



బౌలింగ్ చేస్తున్న ఉత్తరాఖాండ్ క్రీడాకారుడు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విన్నర్ ప్రియాన్స్



మ్యాచ్ అనంతరం ఉత్తరాఖండ్ ఆంధ్రా క్రీడాకారుల కరచాలనం



బ్యాటింగ్ చేస్తున్న హనుమవిహారి



ఉత్తరాఖాండ్ క్రీడాకారుడు ఏఎస్ రావత్ అద్భుత ఫీల్డింగ్

అనుమతులు లేవు.. నిర్వహణ ఆగదు

● కబేళాలకు తరలుతున్న పశువులు ● ఇదీ లోట్లపల్లి సంతలో పరిస్థితి



లోట్లపల్లి సంతకు విక్రయానికి తీసుకొచ్చిన పశువులు

జామి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోట్లపల్లి పశువుల సంత ఏడాదిగా అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే ఈసంత నిర్వహణకు పంచాయతీ అధికారుల నుంచి ఎటువంటి అనుమతి తీసుకోకుండా క్రయవిక్రయాలు చేపడుతున్నారు. ఇక్కడ ఒడిశా, తెలంగాణ, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పశువుల క్రయవిక్రయాలకు వందలాది వస్తున్నారు. ప్రతి వారం మూడు కోట్ల రూపాయలు వ్యాపారం జరుగుతోంది. ఇక్కడి నుంచి వందల సంఖ్యలో పశువులు కబేళాలకు తరలిపోతున్నాయని హిందూధార్మిక సంస్థలు ఆరోపిస్తున్నాయి. వ్యాన్‌లో పదులసంఖ్యలో పశువులు కుక్కి తరలిస్తున్నా రవాణాశాఖ, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. సంతకు అనుమతి మంజూరువిషయంలో పలుసార్లు సంతనిర్వహణ కమిటీ సమావేశమైనా కొంతమంది అధికారులు గైర్హాజరవుతున్నారు. కాగా సంత నిర్వహించవద్దని గతంలోనే నోటీసులిచ్చామని, ఇటీవల నిర్వాహకులను పిలిచి సంత ఆపాలని ఆదేశించామని ఈవోపీఆర్‌డీ ఉమ తెలిపారు. సంత రెన్యూవల్‌పై డీఎల్‌పీవో సమావేశం నిర్వహించాల్సి ఉందని తెలిపారు. కొద్దిరోజుల్లో సంత రెన్యూవల్ సమావేశం జరుగనుందని తెలిపారు.

క్యాబిన్‌లో ఇరుక్కొని డ్రైవర్ మృతి



జోగ గోవింద (ఫైల్)

రేగిడి, నవంబరు 9,(ఆంధ్రజ్యోతి): లగేజీ వాహనం క్యాబిన్‌లో ఇరుక్కున్న సంఘటనలో డ్రైవర్ మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ నీలావతి కథనం మేరకు.. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలంలోని అలమండ కోడూరు గ్రామానికి చెందిన జోగ గోవింద(37) లగేజీ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల నాలుగో తేదీన బరంపురం నుంచి ఉంగరాడమెట్ట తౌడు ఫ్యాక్టరీకి లోడు తెచ్చాడు. ఆ రోజు అన్‌లోడ్‌కాలేదు. మరుసటిరోజు నాగులచవితికి కంపెనీ సెలవుకావడంతో రెండోరోజులు వెహికల్ అన్‌లోడ్ చేయలేకపోయాడు. ఈనెల ఏడో తేదీనన లోడు దించేసి కంపెనీ సమీపంలో వాహనాన్ని పార్కింగ్‌చేశాడు. అయితే కంపెనీకు దగ్గరిలో మద్యంషాపు ఉండడంతో రెండుమూడురోజులుగా మద్యంతాగుతున్నాడు. ఈక్రమంలో క్యాబిన్‌లో నిద్రించే సమయంలో తల కిందలుగా పడిపోయాడు. ఆ సమయంలో వాహనం తలుపులు వేసి ఉండడంతో బయటకు రాలేకపోయాడు. మద్యంమత్తులో ఊపిరి ఆడక మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నాడు.రెండురోజులుగా గోవింద లగేజీ వాహనం యజమానిఫొన్ లిఫ్టచేయకపోవడంతో కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. కర్మాగారం వద్దకు వెళ్లాలని సూచించాడు. ఈక్రమంలో శనివారం ఆయన మృతదేహం వాహనంలో గుర్తించారు.గోవిందకు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని రాజాం ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు శనివారం రేగిడి ఎస్ఐ నీలావతి కేసు నమోదుచేశారు.

లారీ ఢీకొని యువకుడు ..

బొండపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లవాక జంక్షన్ వద్ద జాతీయరహదారి 26పై శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఎస్ఐ యు.మహేష్ కథనం మేరకు.. మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన లోగిస గౌరినాయుడు (50) విజయనగరంలోని ఆర్అండ్‌బీ వద్ద గల రైతుబజారులో కాయగూరలను ప్రతిరోజూ విక్రయిస్తున్నాడు. శనివారం కూడా తన ద్విచక్రవాహనంపై విజయనగరం నుంచి నెలివాడకు గొట్లాం గ్రామానికి చెందిన మీసాల ఈశ్వరరావుతో కలిసి వస్తున్నాడు. ఆ సమయంలో గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని రోళ్లవాకజంక్షన్ వద్దఢీకొంది. దీంతో గౌరినాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో విజయనగరంలోని మహారాజ కేంద్రాసుపత్రికి తరలించారు. గౌరినాయుడుకు భార్య అప్పలసూర్యంతో పాటు ఇద్దరు కుమార్తెలుఉన్నారు. మృతదేహానికి పంచనామానిమిత్తం విజయనగరంలోని మహారాజ కేంద్రాసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదుచేశారు.

వీడిన విజినిగిరి హత్య కేసు మిస్టరీ

● దొంగతనంలో పేరు బయటపెట్టాడన్న కక్షతో కొట్టి చంపేసిన వైనం ● 24 గంటల్లో నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు

జామి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా ఓ వ్యక్తిపై కక్ష పెంచుకున్నాడు. అవకాశం ఎప్పుడు దొరుకుతుందా అని ఎదురుచూశాడు.ఎప్పుడో జరిగిపోయింది, ఇప్పుడు ఎందుకు సరదాగా మందు కొడదామని ఊరి శివార్లలోకి తీసుకెళ్లాడు. ఇద్దరు కలిపి మద్యం తాగారు. ఆ సమయంలో దొంగతనంలో తన పేరు బయటపెట్టాడన్న అక్కసుతో కొట్టిచంపేశాడు. ఇది రెండురోజుల కిందట మండలంలోని విజినిగిరిలో చోటుచేసుకున్న సంఘటన. ఈ మేరకు హత్యకు గురైన గనివాడ అచ్చిబాబు కేసును సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో 24 గంటల్లోనే ఎస్ఐ వీరజనార్దన్ చేధించడంతో మిస్టరీవీడింది.శనివారం సీఐ రవికుమార్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. విజినిగిరిలో హత్యకు గురైన గనివాడ అచ్చిబాబు, అదే గ్రామానికి చెందిన వెంపడాపు సూరిబాబు స్నేహితులు. మూడునెలల కిందట వెంపడాపుసూరిబాబు సెల్‌ఫోన్, నగదు ఓఇంట్లో దొంగిలించాడు.ఆసెల్‌ఫోన్‌ను అచ్చిబాబుకు ఇచ్చివిక్రయించాలని కోరాడు.అచ్చిబాబు జామిలో దీనిని అమ్మేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో సెల్‌ఫోన్ పోయిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దర్యాప్తులో భాగంగా సెల్‌ఫోన్ అమ్మిన అచ్చిబాబును ప్రశ్నించారు.తనకు ఏమితెలియదని సూరిబాబు విక్రయించాలని ఇవ్వడంతో అమ్మానని తెలియజేశాడు.అయితే దొంగతనంలో తన పేరు బయట పెట్టడంతో గ్రామంలో పెద్దలు పంచాయితీ నిర్వహించారు. ఇద్దరికి చెరో మూడువేలు జరిమాన విధించడంతో సూరిబాబు ఆగ్రహంతోఉన్నాడు.దీంతో తనపేరు బయటపెట్టిన అచ్చిబాబును చంపేస్తానని బెదిరించాడు. ఈనేపథ్యంలో అచ్చిబాబు హైదరాబాద్ వెళ్లి పని చేసుకుంటున్నాడు. నాగులచవితికి తన తల్లిని చూడడానికి ఇంటికి వచ్చాడు. నాగులచవితి పూర్తయిన తర్వాత జామిలోఉన్న అక్క కొండమ్మ ఇంటికి వెళ్లి హైదరాబాద్ వెళ్లిపోతున్నానని, వందరూపాయలు కావాలని తీసుకున్నాడు.అయితే హైదరాబాద్ వెళ్లకుండా మళ్లీ విజినిగిరి గురువారం సాయంత్రం చేరుకున్నాడు. ఇదే సమయంలో సూరిబాబు పాతకక్షలు మరిచిపోయాయనని, కలిసి మద్యం సేవిద్దామని చెప్పి గ్రామంలో గల దుకాణంవద్ద ఇద్దరు మద్యం కొనుగోలు చేసి తాగారు. ఈ సమయంలో సెల్‌ఫోన్ వివాదం చర్చకు వచ్చింది. దీంతో ఇద్దరు కొట్టుకున్నారు. అయితే సూరిబాబు అచ్చిబాబుపై విచక్షణారహితంగా కొట్ట డంతో అచ్చిబాబు మృతిచెందాడు. గ్రామశివారులో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లి పడేసి విద్యుదాఘాతంతో చనిపోయినట్లు నమ్మిద్దామని సూరిబాబు ప్రయత్నించాడు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. దీంతో అచ్చిబాబు అక్క ఇచ్చిన ఫిర్యాదులో తన తమ్ముడును సూరిబాబు చంపేశాడని పేర్కొంది. దీంతో దర్యాప్తులో కూడా ఈ విషయమే తేలడంతో సూరిబాబును అరెస్టుచేశారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

విజయనగరంక్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట మండలంలోని పోతనాపల్లిలో అక్రమంగా మద్యంవిక్రయిస్తున్న పైలా సత్యానారాయణను అదుపులోకి తీసుకుని 11 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ సింహాద్రి తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాలతో చేపట్టిన దాడుల్లో హెచ్‌సీ రాంబాబు కానిస్టేబుల్స్ ప్రసాద్, ప్రదీప్ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే చర్యలు: సీఐ



రాజాం: పొగిరిలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ జైభీమ్

కొత్తవలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సారా తయారుచేయడంతోపాటు విక్రయించినా, అక్రమ మద్యం అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవని కొత్తవలస ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు తెలిపారు.శనివారం మండలంలోని అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడు మెరకలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు.

బెల్ట్‌షాపులను నియంత్రిస్తాం

రాజాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులను నియంత్రించడమే లక్ష్యమని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. శనివారం పొగిరి గ్రామస్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆటోలకు రేడియం స్టిక్కర్లు అంటించాలి

ఆటోలకు డ్రైవర్లు వెనుక, ముందు రేడియం స్టిక్కర్ అంటించాలని పట్టణ సీఐ కె.అశోక్‌కుమార్ ఆదేశించారు. బొబ్బిలి రోడ్డులో ఆటోలకు రేడియం స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కోటి పాల్గొన్నారు

పోలీసుల దౌర్జన్యాలపై న్యాయపోరాటం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం మానవ హక్కులను హరిస్తోందని, వారి దౌర్జన్యాలపై తమ పార్టీ న్యాయపోరాటం చేస్తుందని వైసీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు.శనివారం విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావుకు జిల్లాలోని పార్టీ నేతలు, సోషల్‌మీడియా కార్యకర్తలతోకలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ కూటమి అసమర్థ పాలనను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తే వేధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల ఎస్పీలతో పాటు డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

'పది'లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

● ఉప విద్యాశాఖాధికారి మోహనరావు



బాడంగి: రికార్డులు తనిఖీచేస్తున్న మోహనరావు

బాడంగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉప విద్యాశాఖాధికారి మోహనరావు కోరారు.శనివారం స్థానిక జడ్పీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందజేయాలని, అపార్ కార్డుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈవో -2 ఎం.రాజేశ్వరి, ఇన్‌చార్జి హెచ్‌ఎం తెంటు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపార్ పక్రియను వేగవంతం చేయాలి

వేపాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అపార్ ప్రక్రియను పాఠశాలల్లో వేగవంతం చేయాలని ఎంఈవో బాలభాస్కరరావు కోరారు. బక్కునాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలుచేశారు.

●బొబ్బిలి రూరల్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరాయుడుపేట పాఠశాలను ఎంఈవో గొట్టాపు శ్రీనివాసరావు పరిశీలించారు. మధ్యాహ్నభోజనాన్ని తనిఖీచేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు.

సెంచూరియన్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఎంపికైన విద్యార్థులకు జాబ్‌పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

పర్లాకిమిడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి సమీపంలోని సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సాగింది. ఐటీసీ లిమిటెడ్ అగ్రి బిజినెస్ డివిజన్ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో ఒక్కో విద్యార్థికి రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్, డాక్టర్ డీఎన్ రావు, ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్, వీసీ అనితా పాత్రో తదితరులు అభినందించారు.

అసమానతల నిర్మూలనకు ఐక్యపోరాటాలు



మాట్లాడుతున్న తమ్మినేని సూర్యనారాయణ

బొబ్బిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో అసమానతలు నిర్మూలన కోసం బాధిత వర్గాలతో కలిసి ఐక్యపోరాటాలు నిర్వహిస్తామని జిల్లా సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారా యణ తెలిపారు. శనివారం బొబ్బిలిలో సీపీఎం పట్టణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు.పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌చేశారు. మహాసభలో సీపీఎం నాయకులు వి.లక్ష్మి, పొట్నూరు శంకరరావు, మండల కన్వీనరు ఎస్.గోపాలం, కె.పుణ్యవతి, యుగంధర్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులను ఆదుకోండి



లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామీణ వైద్యులు

లక్కవరపుకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం లక్కవరపుకోటలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2008లో అప్పటి ప్రభుత్వం 429 జీవో ఇచ్చిందని, తద్వారా గుర్తింపు ఇచ్చి శిక్షణ ఇచ్చిందని తెలిపారు. 2017లో చంద్రబాబు జీవో-465 ఇచ్చారని అది కార్యరూపం దాల్చలేదని చెప్పారు.

●శృంగవరపుకోట రూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేటలో నిర్వహిస్తున్న గైరమ్మసంబరాల్లో భాగంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ అమ్మవారికి పూజలుచేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి జుత్తాడ రామసత్యం పాల్గొన్నారు.

100 మంది వీల్‌చైర్ల పంపిణీ

కొత్తవలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో దివ్యాంగులకు లీగల్ సర్వీసెస్ డే పురస్కరించుకుని 100 మంది దివ్యాంగులకు చెవిటి మిషన్లు, వీల్ చైర్లు పంపిణీ చేసినట్లు మంగళపాలెంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు తెలిపారు. శనివారం తెలంగాణకు సంబంధించి హైదరాబాద్‌లో, ఏపీకి సంబంధించి విజయవాడలో కార్యక్రమాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

చెరువు గట్టు ఆక్రమిస్తే చర్యలు

గంట్యాడ,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కొర్లాం గ్రామపరిధిలో గల నాయరాలుచెరువు గట్టును ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నీలకంఠేశ్వరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో చెరువు గట్టు ఆక్రమణ శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో తహసీల్దార్‌తోపాటు సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ,వీఆర్వో కొర్లాం నాయరాలు చెరువును పరిశీలించారు. గట్టు యంత్రంతో తవ్వడంపై రైతులతో మాట్లాడారు. చెరువు గట్టు హద్దులు నిర్ధారించి బోర్డులను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

12లోగా సరుకులు అందించాలి

రాజాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు సరుకులు ఈనెల 12లోగా అందించాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని సీఎస్‌డీటీ చిరంజీవి ఒకప్రకటనలో తెలిపారు.14లోగా మిగిలిఉన్న సరుకులను రిటర్న్ స్టాక్ చేయాలని పేర్కొన్నారు. 15లోగా వచ్చే నెలకు సంబంధించి రేషన్ సరుకులు రేషన్‌డిపోలకు చేరేలా చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించారు.

16,17 తేదీల్లో సీపీఎం మహాసభలు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించేందుకు ఈనెల 16, 17 తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని సీపీఎంజిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు తెలిపారు. ఈ మేరకు విజయనగరంలో శనివారం మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమణమ్మ, జగన్మోహన్, బి.రమణ పాల్గొన్నారు.

16న చలో విజయవాడ

బొబ్బిలి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో శనివారం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ సురగాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే చలో విజయవాడ కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి గర్భాపు రమేష్, సభ్యులు బాలరాజు, శంకరరావు, పిల్లి శంకరరావు పాల్గొన్నారు.

17న కంచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

గంట్యాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో ఈనెల 15,16,17 తేదీల్లో కంచమ్మతల్లి విగ్రహాప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నారు. ఇక్కడ విగ్రహం హుద్‌హుద్ తుఫాన్‌కు పాడైన విషయం విదితమే.17న విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

30న తుది ఓటర్ల జాబితా

విజయనగరం, కలెక్టరేట్; నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు జిల్లా వ్యాప్తంగా 3,650 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో ఆఫ్‌లైన్‌లో 3115, ఆన్‌లైన్ 535 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించనున్నారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబరు 30న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై శిక్షణ

లక్కవరపుకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఎల్.కోట పీహెచ్‌సీలో శనివారం ఆరోగ్య పరిరక్షణపై పీహెచ్‌సీ వైద్యుడు బి.అనీల్‌కుమార్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సచివాలయాలు వారీగా బృందాలు ఏర్పడి ఏర్పడి పారిశుధ్యం, తాగునీరు, క్లోరినేషన్, మురుగులో తాగునీటి పైపులు లేకుండా చూడడం, జ్వరాలపై ఇంటింటా సర్వే, డయేరియాపై శిక్షణ ఇచ్చారు.

రాజాంలో చిత్రలేఖనం పాటీలు

రాజాం/రూరల్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): రాజాం వికాసతరంగిణి కార్యాలయంలో శనివారం యోగ సంరక్షణ అనంతరం రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఆజ్ఞ గురించి ఎదురుచూస్తూ నమస్కరిస్తున్న దృశ్యంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు మాట్లాడుతూజీవితంలో గురువుస్థానం చాలా గొప్పదని, ఆ స్థానానికి ఉన్న విలువ, గౌరవం వెలకట్టలేనిదని తెలిపారు.

నీటి పథకాల ట్యాంకులు క్లీనింగ్ చేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు



గంట్యాడ: రామవరంలో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

కొత్తవలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రక్షిత మంచి నీటి పథకాలకు సంబంధించిన ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు కోరారు. శనివారం ఉత్తరాపల్లి పంచాయతీ గాంధీనగర్‌లో పారిశుధ్య పనులు పరిశీలించారు.కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీదేవి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గంట్యాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు సూచించారు. రామవరంలో ఇంటింటా సర్వే పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువుల్లో తాగునీటి పైపులు లేకుండా చూడాలని సర్వే సిబ్బందికి ఆదేశించారు. ఆయనతో పాటు ఈవోపీఆర్డీ భానోజీరావు ఉన్నారు.

ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలి

రాజాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):మరుగుదొడ్ల నిర్వహణపై ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం రాజాంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాగా పెనుబాకలో మరుగుదొడ్ల వినియోగంపై చేపడుతున్న సర్వేను ఎంపీడీవో పరిశీలించారు.

వైద్య కళాశాలకు ఆనందగజపతిరాజు పేరు పెట్టాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేసిన పూసపాటి ఆనంద గజపతిరాజు పేరును ప్రభుత్వ వైద్య కళాశాలకు పెట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు పార్టీ నాయకులు రాజారావు, నాగభూషణం, రామచంద్రరాజు, రామ్మోహన్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 9: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విజయనగరం బ్రాంచ్ నాయకులు, యూనియన్ ప్రతినిధులు ఈ.రామ కృష్ణ, కృష్ణ, సూరినాయుడు, వాసుదేవరావు కలిశెట్టికి వినతిపత్రం అందజేశారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు: ఎస్పీ

విజయనగరం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్, శబ్దకాలుష్య సైలెన్సర్లను వినియోగించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు.ఈసందర్భంగా శబ్దకాలుష్య సైలెన్సర్లు, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్‌తో పట్టుబడిన వారిని స్టేషన్‌కు తరలించి వాహనాలు సీజ్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో 531 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాఘవులు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు పాల్గొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ యూనియన్ అధ్యక్షుడిగా కృష్ణ

రాజాం రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):రాజాం నియోజకవర్గ ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ధర్మాన కృష్ణ ఎన్నికయ్యారు. శనివారం రాజాంలోని సంఘ కార్యాలయంలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు.ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడిగా తురక బలరాం, ఉపాధ్యక్షుడిగా దూసి సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా బోనెల గౌరీశ్వరరావు, కోశాధికారిగా కలమట జగన్నాథం, కార్యదర్శిగా బత్తిన సురేష్‌ను ఎన్నుకు న్నారు. మీడియా కన్వీనర్లగా గడిబండ సూర్యనారాయణ, బీంపల్లి తిరుపతిరావు, తీగల మోహన్‌ను నియమించారు. బొత్స బుద్ధుడు, బొత్స జానకిరావు, కంబాల సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జరజాన నీలయ్య, నక్క తవిటయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పిస్తాం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రజలు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తామని జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. శనివారం జిల్లా పాత కోర్టు భవన సముదాయంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి న్యాయ సేవలను అందించే ఉద్దేశంతో న్యాయసేవాధికార సంస్థను 1995 నవంబరు 9న సుప్రీంకోర్టు ప్రారంభించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి అప్పలస్వామి, స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయాధికారి పి.బుజ్జి, డీఆర్వో శ్రీనివాసమూర్తి, డీఎస్పీ వీరకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయి కల్యాణ్‌చక్రవర్తి

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

● అంబేడ్కర్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య

బొబ్బిలి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దళితుల భూములకు రక్షణ కల్పించాలని అంబేడ్కర్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య కోరారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో దళితుల భూములకు రక్షణ లేకపోవడంతోపాటు పలు సమస్యలపై ఫిబ్రవరిలో ఢిల్లీలో జంతర్‌మంతర్ ముందు ధర్నా చేయనున్నట్లు చెప్పారు.ఈ మేరకు శనివారం బొబ్బిలిలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో దళితులకు జరుగుతున్న అన్యాయాలపై ఎమ్మెల్యేలు ప్రశ్నించాలని ఒత్తిడి తెస్తామని తెలిపారు. సమావేశంలో దళిత నాయకులు గొంప ప్రకాశరావు, ఎండ గోపాలరావు, యర్రారపు ఆనందరావు, నగర ఈశ్వరరావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికి ఓటరుగా నమోదు చేయాలి

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోషఫ్

రాజాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓటరుగా 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరిని నమోదు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎల్.జోషఫ్ కోరారు. రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేశారు.

●రామభద్రపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదు కార్య క్రమం సద్వినియోగం చేసుకోవాలని బొబ్బిలి ఆర్డీవో జేవీఎస్ రామ్మోహనరావు కోరారు. రామభద్రపురం జడ్పీఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.

●బాడంగి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ సుధాకర్ కోరారు.బాడంగి ఏపీ రెసిడెన్షియల్‌స్కూల్‌లో ఓటర్లనమోదు స్పెషల్‌డ్రైవ్‌కేంద్రాన్ని పరిశీలించారు.

●గంట్యాడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటు హక్కు నమోదుకు మండలంలోని 24 దరఖాస్తులు వచ్చాయి. శనివారం అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు దరఖా స్తులను స్వీకరించారు. నరవలో ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి , రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్డీవో రామమోహనరావు పరిశీలించారు. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీను ఉన్నారు.

●వేపాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం, బొద్దాం పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ శనివారం పరిశీలించారు. సోంపురంలోని 79,80, బొద్దాంలో 72,73,74 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ రాములమ్మకు సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ సునీత, వీఆర్వో అప్పలరాం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలి

గరుగుబిల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోలు అందుబాటులో ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌరీప్రసాద్ అన్నారు. గొట్టివలస కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి ఓటరుగా నమోదు కాకుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలం మొత్తంపై 49 కేంద్రాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో బీఎల్వోలు విధిగా దండోరా వేయించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు పి.శిరీష, ఉపాధి క్షేత్ర సహాయకుడు నల్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

పార్వతీపురంటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.చక్రధర్‌శర్మ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మన్యం జిల్లాలో గల కాంట్రాక్టు అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 114 జీవో అమలుతో పాటు కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లా కాంట్రాక్టు అధ్యాపక సంఘ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం, కురుపాం, దోనుబాయి, సీతంపేట, పాచిపెంట, సాలూరు తదితర గిరిజన మండల కేంద్రాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు కోలక అవినాష్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ ద్వారా గానీ వెలుగు, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా గానీ గిరిజన రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో డబ్బు చెల్లించాలని వీరు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో నిధులు విడుదల చేసేవారు కాదని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతా రహితంగా విచారణ

జియ్యమ్మవలస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి మృతిపై మంత్రి సంధ్యారాణి చేసిన విచారణ బాధ్యతా రాహిత్యంగా ఉందని మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి ఆరోపించారు. శనివారం ఆమె ఆ పాఠశాలను సందర్శించారు. విద్యార్థి మృతిపై అక్కడి విద్యార్థులను, హెచ్‌ఎంను, డిప్యూటీ వార్డెన్‌ను ఆరా తీశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మంత్రి సంధ్యారాణి శుక్రవారం తూతూ మంత్రంగా పాఠశాల సందర్శన చేశారని విమర్శించారు. విద్యార్థి జీవన్ కుమార్ మృతిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందని ఆమె ప్రశ్నించారు. తండ్రి కోరితేనే రీ ఎంక్వైరీ వేస్తామని చెప్పడం కరెక్టా? అని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమిస్తామని చేసిన హామీ ఏమయ్యిందన్నారు.

అచ్చెన్న దృష్టికి నియోజకవర్గ సమస్యలు

పాలకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గంలోని పలు సమస్య లను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. శనివారం నిమ్మాడ గ్రామంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సమస్యలపై వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కా రానికి మంత్రి హామీనిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నాయ కులు సామంతుల దామోదరరావు, ఖండాపు వెంకటరమణ, గుమ్మడి సింహాద్రి, పోరెడ్డి వెంకటినాయుడు, శాసుబిల్లి బుజ్జి, మౌళి, చంద్రం, శాసపు సర్యారావు, మజ్జి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎనీమియా కేంద్రాన్ని విశాఖలోనే ఏర్పాటు చేయాలి

బలిజిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ ఎనీమియా కేంద్రాన్ని విశాఖలోనే ఏర్పాటు చేయాలని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో కాకుండా మంగళగిరి ఎయిమ్స్‌కు సికిల్‌సెల్ ఎనీమియా కేంద్రాన్ని తరలించాలని నిర్ణయం తీసుకుంటుందని, ఈ నిర్ణయం వెంటనే ఉపసంహరించాలని కోరారు.

దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

బెలగాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలన కొనసాగడం లేదని, రెడ్‌బుక్ పాలన సాగుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరిక్షిత్ రాజు ఆరోపించారు. ఈ మేరకు ఆయన మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి ఎస్పీ మాధవరెడ్డికి శనివారం వినతిపత్రం ఇచ్చారు. వైసీపీ నాయకులపై టీడీపీ సోషల్ మీడియా దుష్ప్రచారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ న్యాయసేవా దినోత్సవం

ఒడిశా

రాయగడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కోర్టులో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు న్యాయాధికారి, న్యాయసేవా విభాగం అధ్యక్షుడు సత్యనారాయణ షడంగి ఆదేశాల మేరకు న్యాయసేవా విభాగ న్యాయాధికారి సుబ్రత్ ఆచార్య నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమలో వివిధ విభాగాల న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, జీసీడీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత స్థానిక కోర్టు నుంచి డైలీ మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఇలాగేనా పారిశుధ్య నిర్వహణ?

- రహదారిపైనే చెత్త కుప్పలు
- చెత్త కుండీలు లేక ఎక్కడికక్కడే పారబోస్తున్నవైనం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



వీరఘట్టం మండల కేంద్రంలో రోడ్డుపైనే పేరుకుపోయిన చెత్త

వీరఘట్టం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ పట్ల అధికారులు ఎంతవరకు శ్రద్ధ కనబరుస్తున్నారో ఈ చిత్రం చూస్తేనే అర్థమవుతుంది. వీరఘట్టం మండల కేంద్రంలోని శాంతి ఆశ్రమం నుంచి కూరాకుల వీధి పాఠశాలకు వెళ్లే దారిలో గత రెండు మూడు రోజులుగా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. అయితే ఈ ప్రాంతానికి సమీపంలోనే చెత్త డ్రమ్ములు ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులు అందులో చెత్తను వేయకపోవడంతో ఇలా ఇక్కడ చెత్త పేరుకుపోతున్నట్టు తెలుస్తోంది. ఎక్కడికక్కడే అందుబాటులో వీలైనన్ని చెత్త డ్రమ్ములు ఏర్పాటు చేస్తే ఈ పరిస్థితి రాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా పారిశుధ్య నిర్వహణ పట్ల అధికారులు శ్రద్ధ కనబరిచి, స్థానికులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే స్థానికులకు అందుబాటులో చెత్త కుండీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఇక్కడి చెత్తను తొలగింపజేసి, చెత్త డమ్ములను అందుబాటులో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ చెత్త కారణంగా ఈ రహదారి గుండా ప్రయాణించలేకపోతున్నామని వాపోతున్నారు.

చెత్త కుండీలను ఏర్పాటు చేస్తాం

ఈ ప్రాంతాన్ని పరిశీలించి, చెత్తను తొలగింపజేస్తాం. వీలైనంత త్వరగా కొత్త చెత్త కుండీలను స్థానికులకు అందుబాటులో ఏర్పాటు చేస్తాం.

- రవి, ఈవో, వీరఘట్టం

శ్యామలాంబ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామ దేవత శ్రీశ్యామలాంబ పండుగను ఘనంగా నిర్వహించా లని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఈ మేరకు సాలూరులోని తన నివాసంలో శనివారం అమ్మవారి పండుగకు సంబ ధించి కరపత్రాలను ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రంచంద్ర సన్యాసిరాజు (యువరాజు) ఆధ్వర్యం లో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబరు 3న పసుపు కుంకుమలు సమర్పించుట, వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న సాయంత్రం అమ్మవారిని ఊరిలోకి తెచ్చుట, 4న మధ్యాహ్నం ఘటాలను తిప్పుట, 11న చెట్టుకు ఉపవాసం చెప్పుట, 21న ఉదయం చెట్టు కొట్టడం, మార్చి 1న ఉదయం అమ్మవారి సిరిమాను తయారు చేస్తా రని వివరించారు. మే 18న ఉయ్యాల కంబల ప్రారంభం, 19న సాయంత్రం తొలేళ్ల, 20న సిరిమాను ఉత్సవం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడుతూ పట్టణంలో మార్చి 14 నుంచి మే 20 వరకు ఎలాంటి వివాహాలు జరుపుకోకూడదని తెలిపారు. ప్రతిఒక్కరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల ఈశ్వరరావు, కేతిరెడ్డి చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి, తదితరులు

నేడు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ సమావేశం

పార్వతీపురంటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ నాయకుడు ఆర్.సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో రాష్ట్రంలో జరగాల్సిన నూతన జిల్లాల సంఘాల ఎన్నికలతో పాటు సంఘ సభ్యత్వం, 12 పీఆర్సీ, 11 పీఆర్సీ బకాయిలు, ఏరియర్స్ ఇతర సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాల్లో ఉన్న నాలుగో తరగతి ఉద్యోగులు తప్పకుండా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

గుమ్మలక్ష్మీపురంలో ఓటు నమోదు కేంద్రం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఓటు నమోదు కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్ తెలిపారు. అర్హులు సంబంధిత పత్రాలు చూపించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. ఆదివారం ఈ కేంద్రంలో బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు.

ఔషధ మొక్కలపై అవగాహన కల్పించండి

గరుగుబిల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల ప్రాధాన్యతను గిరిజన ప్రాంతాల్లో తెలియపర్చాలని జట్టు ట్రస్ట్ కో డైరెక్టర్ మార్కొండ నూకం నాయుడు అన్నారు. శనివారం స్థానిక తోటపల్లి జట్టు నూతన కార్యాలయ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లోని మొక్కల విశిష్టతను ఆయన క్షేత్ర స్థాయిలో వివరించారు. కురుపాం మండలం మొండెంఖల్, ఉరిడి పంచాయతీల పరిధిలోని సుమారు 60 మందికి పైగా గిరిజన మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

సాలూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల్లో వైద్యాధికారి డి.శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ముచ్చర్లవలస, గొందివలస, పుల్లేరు గుడ్డివలస తదితర గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. జ్వర పీడితులకు గుర్తించి, చికిత్స చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

సీతంపేట రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో కీసరజోడు పంచాయతీ పరిధిలోని దిబ్బగూడ గ్రామంలో సున్నాపురం నాగరాజు అనే గిరిజనుడి పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యింది. శనివారం మధ్యాహ్నం సమయంలో ఉన్నట్టుండి పూరింటి నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటలను అదుపు చేసేందుకు గ్రామస్థులు ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. కొత్తూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చినప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. అయితే ఇంటి యజమాని నాగరాజు గత మూడు రోజుల కిందట ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి పని కోసం వలస వెళ్లిపోయినట్టు గ్రామస్థులు తెలిపారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఆ ప్రమాదంలో ఇంట్లో ఉన్న బీరువా, ఫ్యాన్ పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు.

చురుగ్గా రహదారులకు మరమ్మతులు

పార్వతీపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గోతుల రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినా గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులు మరమ్మతులపై దృష్టి కేంద్రీకరించింది. సుమారు 223 కిలోమీటర్ల రహదారులను మరమ్మతులు చేసేందుకు రూ.12కోట్ల 50 లక్షలు మంజూరు చేసింది. నిధుల మంజూరు ప్రాప్తికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. ● మక్కువ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర గ్రామం నుంచి మావుడి వరకు రహదారి మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తులకు దూరంగా ఉండాలి

గరుగుబిల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులకు దూరంగా ఉండాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న ప్రాంతాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న దళాయివలసకు చెందిన మహిళ మెడలోని గొలుసును గుర్తు తెలియని వ్యక్తి దొంగలించుకుపోయాడన్నారు. నిందితుడి ఆచూకీ కనిపెట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ పరిశీలనలో సిబ్బంది పాల్గొన్నారు.



ఉల్లిభద్ర ప్రాంతంలో పరిశీలన చేస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

బియ్యం అక్రమ తరలింపుపై విచారణ చేయాలి

బెలగాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉలిపిరి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన బియ్యం అక్రమంగా తరలింపుపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు టి.అఖిల్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలకు సరఫరా చేయాల్సిన బియ్యం అక్రమంగా విక్రంపురం గ్రామానికి తరలించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బీమా చేయించాలి

బెలగాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ, ఇతర మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులకు ఇటీవలె ఎక్కువగా మరణిస్తున్నారని, వారికి బీమా చేయించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. శనివారం స్థానిక యూటీఎఫ్ నాయకులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్ విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల ఆశ్రమ పాఠశాల, ఇతర పాఠశాలల విద్యార్థులు అనారోగ్యానికి గురైన మృత్యువాత పడుతున్నారని, వారికి బీమా చేయిస్తే వారి కుటుంబానికి కొంతమేర ఆసరాగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రజా పోరును విజయవంతం చేయండి

సాలూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలపై భారాలను నిరసిస్తూ నవంబరు 8 నుంచి 14 వరకు ప్రజాపోరు పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు ఎన్‌వై నాయుడు కోరారు. ఈ మేరకు శనివారం సాలూరులో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పోస్టర్‌ను విడుదల చేశారు.

జలజీవన్ పనుల పరిశీలన

భామిని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా చేసేందుకు సిద్ధం చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు తెలిపారు. శనివారం జలజీవన్‌మిషన్ పనులను సందర్శించారు. సింగిడి, వంశధార నదిలో ఇంటాక్ వెల్ మార్కింగ్, బొమ్మిక ఓహెచ్‌ఎస్‌ఆర్ గేట్ చెకింగ్, పసుకుడి కొండపైన ఓహెచ్‌డీ ఆర్ ట్యాంక్ పనులను సందర్శించారు. కాంట్రాక్టర్ ప్రతినిధులకు పలు సూచలను చేశారు. జలజీవన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.62కోట్లు టెండర్లు ఇచ్చిందని, ఈ పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సింగిడి నదీతీరం వంశధార నది నుంచి పసుకుడి కొండపైకి 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకు నిర్మించి వాటిని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు ఏఈ సందీప్‌కుమార్ ఉన్నారు.

నమో వేంకటేశ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కార్తీకమాసంలో రెండో శనివారం కావడంతో జిల్లాలోని వేంకటేశ్వరస్వామి దేవాలయలు భక్తులతో కిటకిటలాడాయి. గరుగుబిల్లి తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే సీతంపేటలో టీటీడీ వేంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. (ఆంధ్రజ్యోతి బృందం)



సీతంపేట రూరల్: టీటీడీ దేవాలయంలో..



పార్వతీపురంటౌన్: కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు